

కేజీబీవీ విద్యార్థులను తీర్చిదిద్దాలి

కేజీబీవీలలో చదువుతున్న విద్యార్థులను మట్టిలో మాణిక్యాలుగా తీర్చిదిద్దాలని కేజీబీవీల సబ్జెక్టు టీచర్లకు రాష్ట్ర విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ దేవరాజు పిలుపునిచ్చారు. -8లో



సెప్టెంబర్ 8 నుంచి జాతీయ కౌన్సిల్ సమావేశాలు

సెప్టెంబర్‌లో అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కౌన్సిల్ సమావేశాలు కడపలో నిర్వహించనున్నారు. -8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
35.4/27.4

జిల్లాలో ఆదివారం 27.4 - 35.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.6 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నంద్యాల డయాసిస్ బిషప్ ఎంపిక


సంతోష్ ప్రసన్నరావు

కలసపాడు: నంద్యాల డయాసిస్ బిషప్‌గా కలసపాడుకు చెందిన కె.సంతోష్ ప్రసన్నరావును సినాడ్ సభ్యులు ఎన్నుకున్నారు. బిషప్‌గా ఉన్న పుష్పలలిత రిటైర్డ్ కావడంతో 2024 ఏప్రిల్‌లో జరిగిన బిషప్ ఎన్నికల్లో రెవరెండ్లు సంతోష్ ప్రసన్న రావు, నందం ఐజాక్, సాల్మన్, ఐజాక్ ప్రసన్న కుమార్ పోటీ పడ్డారు. సినాడ్ డయాసిస్‌లో మోడరేటర్ లేకపోవడంతో నంద్యాల బిషప్ ఎంపిక ఆలస్యమైంది. ఇటీవల మోడరేటర్‌ను ఎన్నుకున్నారు. ఆదివారం సినాడ్ సభ్యులు కె.సంతోష్ ప్రసన్న రావును బిషప్‌గా ఎన్నుకున్నారు. డిగ్రీ, బీఈడీ పూర్తి చేసిన సంతోష్ ప్రసన్న రావు హైదరాబాద్‌లోని బైబిల్ కాలేజీలో డిగ్రీ పూర్తి చేసి పాస్టర్‌గా పని చేస్తున్నారు. ప్రస్తుతం ముద్దనూరు ఫాస్ట్రేట్ చర్చి డీనరీ చైర్మన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈయన బిషప్‌గా ఎంపిక కావడంపై నంద్యాల డయాసిస్ చర్చి సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం కేథడ్రాల్ చర్చిలో సంతోష్ ప్రసన్నరావుకు బిషప్‌గా పట్టాభిషేకం నిర్వహించనున్నారు.

కాల్ సెంటర్ సేవలు వినియోగించుకోవాలి

కడప సెవెన్‌రోడ్స్: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిన మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని డీఆర్వో విశ్వేశ్వరనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. అర్జీదారులుతమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నెంబర్‌కు కాల్ చేయవచ్చని పేర్కొన్నారు.

సభాభవన్‌లో పీజీఆర్ఎస్ నిర్వహణ

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)ను సోమవారం సభాభవన్‌లో నిర్వహిస్తున్నట్లు డీఆర్వో విశ్వేశ్వర నాయుడు తెలిపారు. అర్జీదారులు వారి అర్జీలు మీకోసం. ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతోపాటు మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామని పేర్కొన్నారు.

డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం

డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 9.30 నుంచి 10 గంటల వరకు జరుగుతుందన్నారు. ప్రజలు 08562-244437 ల్యాండ్ లైన్ నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చునన్నారు.

చెస్‌లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ


వినమ్రత ధనిత అనీష్ దర్బారీ

కడప వైఎస్ఆర్ సర్కిల్: బెంగుళూరులో జరిగిన 3వ చెస్ ఫ్యూషన్ నేషనల్ లెవల్ చెస్ టోర్నమెంట్‌లో జిల్లాకు చెందిన చెస్ క్రీడాకారులు ప్రతిభ చాటారని చెస్ కోచ్ అనీష్ దర్బారీ పేర్కొన్నారు. బెంగుళూరులోని గోల్డెన్ బీ గ్లోబల్ స్కూల్‌లో జరిగిన 3వ చెస్ ఫ్యూషన్ నేషనల్ లెవల్ చెస్ టోర్నమెంట్‌లో అండర్-8లో బాలికల విభాగంలోజిల్లాకు చెందిన వినమ్రత ట్రోఫీ గెలుచుకుందన్నారు. అండర్ -10లో బాలికల విభాగంలో ప్రొద్దుటూరు చెందిన ధనిత మెడల్ అందుకుందన్నారు. కాగా కాగా సీనియర్స్ విభాగంలో చెస్ కోచ్ అనీష్ దర్బారీ ప్రథమ స్థానంలో నిలిచి నగదు బహుమతి అందుకోవడం విశేషం.

ఇంటర్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక


ఏకగ్రీవంగా ఎన్నికైన ఇంటర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నూతన కమిటీ

కడప ఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఆదివారం కడపలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఎలక్షన్ ఆఫీసర్ నిత్యపూజయ్య ఆధ్వర్యంలో నామినేషన్ స్వీకరణ చేపట్టగా అన్ని పోస్టులకు ఒక్కో నామినేషన్ చొప్పున దాఖలు అయ్యాయి. దీంతో ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. ఇందులో ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షుడిగా సురేష్, కార్యదర్శిగా వెంకటసుబ్బయ్య, వైస్ ప్రెసిడెంట్‌గా ఖాదర్ హుస్సేన్, జాయింట్ సెక్రటరీగా మల్లికార్జునరాజు, ట్రెజరర్‌గా రాధాకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా శివప్రసాద్, ఉమెన్ సెక్రటరీగా ఇందుమతి, ఈసీ మెంబర్లుగా బాలనరసయ్య, శివప్రసాద్, చరణ్‌లు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

పచ్చ కుట్రలకు తెర!

- ప్రలోభాలు, బెదిరింపులకు పాల్పడుతున్న బీటెక్ రవి, ఎమ్మెల్యే ఆది ద్వయం
- మాట పెడచెవిన పెట్టినవారిపై వ్యవస్థలతో దాడి
- అచ్చవెల్లి రేషన్‌షాపు డీలర్‌పై విజిలెన్సు తనిఖీలు బెదిరింపులో భాగమే
- తెరపైకి వస్తున్న పోలీసు అధికారుల వేధింపులు


అచ్చవెల్లి గ్రామంలో చౌక దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

సాక్షి ప్రతినిధి, కడప: తెలుగుతమ్ముళ్లు కుట్రలకు తెరలేపుతున్నారు. టీడీపీకి బీజేపీ తోడు కావడంతో 'లెక్క' లేనన్ని కుట్రలు, బెదిరింపుల కుతంత్రాలు తెరపైకి తెరపైకి తెస్తున్నారు. ఒక్క జెడ్పీటీసీ సీటు కోసం అధికారాన్ని అడ్డుపెట్టుకొని అడ్డదారులు ఎంచుకుంటున్నారు. వైఎస్సార్‌సీపీ నేతలను ప్రలోభాలకు గురిచేయడం లేదంటే బెదిరింపులకు దిగుతున్నారు. ఈమొత్తం వ్యవహారం పులివెందుల టీడీపీ ఇన్‌ఛార్జ్ బిటెక్ రవి, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి కేంద్రంగా నడుస్తోంది.

- ఈనెల 12న జరిగే జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో గెలుపు కోసం కూటమి సర్కార్ అడ్డదారులు ఎంచుకుంది. వైఎస్సార్‌సీపీకి గణనీయమైన ప్రజాబలం ఉండడంతో ప్రజాస్వామ్యబద్ధంగా ఎదుర్కొలేమనే అంచనాకు టీడీపీ,బీజేపీ నేతలొచ్చారు. ఈ క్రమంలో ప్రలోభాల దిశగా అడుగులు వేస్తున్నారు. ఈ మేరకు పులివెందుల పరిధిలో ఇద్దరు నేతలకు టీడీపీ కండువా కప్పారు. మరికొందర్ని అలాగే పార్టీ మార్చుకునే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో కూటమి నేతల యత్నాలను కొంత మంది తీవ్రంగా ప్రతిఘటిస్తున్నారు. అలాంటి వారిపై బెదిరింపులకు పాల్పడుతున్నారు. అప్పటికీ కాదు కూడదన్నవారికి పోలీసు వ్యవస్థ ద్వారా భయపెడుతున్నారు. ఇందులో భాగంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ఎటువంటి కేసులు లేకున్నప్పటికీ ఎన్నికలలో గ్రామ స్థాయి నాయకుల ప్రభావాన్ని కట్టడి చేసే చర్యలకు దిగారు.'అసలెందుకు పోలీసుస్టేషన్‌కు మమ్మల్ని పిలిపించార'ని ఎవరైనా అడిగితే గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తల కోసం పిలిచామని బదులిస్తున్నట్లు సమాచారం. పోలీసు వ్యవస్థ శృతిమించి వ్యవహరించే అవకాశం కూడా లేకపోలేదనే వాదనలు విన్పిస్తున్నాయి. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల నిర్వహణ కోసం కృషి చేస్తే తప్పు లేదు కానీ ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదని ప్రజాస్వామ్యవాదులు వెల్లడిస్తున్నారు.



ఉస్కో అంటే చాలు.. ఎగిరిపడుతున్న వ్యవస్థలు

జెడ్పీటీసీ ఎన్నికలల్లో ఓడిపోతామనే భయంతో కనీస పరువు దక్కించుకోవాలనే దిశగా టీడీపీ, బీజేపీ నేతలు ఎత్తుగడలు వేస్తున్నారు. ఆ మేరకు వ్యవస్థలను ఇప్పటినుంచే వాడుకుంటున్నారు. ఈ క్రమంలో ఆదివారం కడప విజిలెన్సు అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు సీఐ శివన్న తదితర అధికారులు తనిఖీల పేరిట పల్లె బాట వెళ్లారు. వైఎస్సార్‌సీపీ సానుభూతి పరుడుగా ఉన్న అచ్చవెల్లి గ్రామానికి చెందిన రేషన్ డీలర్ జనార్ధన్‌రెడ్డి రేషన్‌షాపులో రెవెన్యూ, విజిలెన్సు అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు ఉమ్మడిగా తనిఖీలు చేపట్టారు. నిర్ణయిత పరిమితి కంటే 2కిలోలు బియ్యం తక్కువగా ఉన్నాయని కేసు నమోదు చేశారు. రేషన్ డీలర్ రూ.2 విలువైన రెండు కిలోలు బియ్యం స్వాహా చేశారని కేసు నమోదు చేయడాన్ని ఆశ్చర్యం కల్గించినా విజిలెన్సు అధికారులు కేసు నమోదు చేసిన విషయం వాస్తవమే. ఈ సాకుతో రేషన్ డీలర్‌షిప్‌ను రద్దు చేసే ఎత్తుగడను ఎంచుకున్నట్లు సమాచారం.

ప్రతిఘటిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ప్రలోభాలు బెదిరింపులను వైఎస్సార్‌సీపీ శ్రేణులు ప్రతిఘటిస్తున్నాయి. పులివెందులలో ఇటీవల పార్టీ ఫిరాయించిన ఇరువురు నేతలు పలు రకాలుగా ఆశలు చూపుతున్నట్లు సమాచారం. ఈక్రమంలో 'మీరా..మమ్మల్ని ప్రలోభాలకు గురి చేసేది, మీరేంత, మీ స్థాయి, శక్తి ఎంత?' అంటూ బాహాటంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు నిలదీస్తున్నట్లు తెలుస్తోంది. వ్యక్తిగత సమస్యలుండొచ్చు అంతమాత్రనా వైఎస్ కుటుంబంతో ఉన్న అనుబంధాన్ని తెంచలేరంటూ పలువురు తెగేసి చెబుతున్నట్లు తెలుస్తోంది. 'మీరేదో కక్కుర్తి పడి వెళ్లారు, ఇలాంటి వ్యవహారాల్లో తలదూరిస్తే.. ఇక మర్యాద ఉండదు..' అని స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చినట్లు సమాచారం.

మాటల్లో.. సాయంలో..
అన్నింట్లో 'కోత'లే!

- కూటమి ప్రభుత్వంలో 1,94,047 మందికే అన్నదాత సుఖీభవ
- జిల్లావ్యాప్తంగా 16,434 మందికి ఎగనామం
- తొలి విడతలో రూ.11.50 కోట్లు నష్టపోయిన రైతులు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 2,10,481 మంది రైతులకు లబ్ధి


అన్నదాత సుఖీభవ నిధులకు సంబంధించిన చెక్కును అందచేస్తున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్



కడప అగ్రికల్చర్: కూటమి ప్రభుత్వం రైతులను మరోసారి దగా చేసింది. అధికారంలోకి రాకముందేమో అన్నదాత సుఖీభవ కింద ఏటా ప్రతి రైతుకు రూ. 20 వేలు ఇస్తామని చెప్పి మాటల్ని కోటలు దాటించింది. అధికారంలోకి వచ్చాక నిధుల్లో కోత కోసింది. రైతులకు వ్యవసాయంలో అండగా నిలబడాల్సింది పోయి అవస్థలకు గురి చేస్తోంది. తాజాగా అన్నదాత సుఖీభవ పథకంలో పలు రకాల కొర్రీలతో కోత విధించి ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేసిన ప్రతి ఒక్కరికీ రైతు భరోసా నిధులను మంజూరు చేసి ఆర్థిక చేయూతనందించి పంటలసాగుకు అండగా నిలిచింది. కూటమి ప్రభుత్వం అందుకు భిన్నంగా సాయంలో కోత కోసింది. వివిధ కారణాలను సాకుగా చూపిస్తూ అన్నదాత సుఖీభవ నిధుల్లో ఎగనామం పెట్టింది. జిల్లావ్యాప్తంగా 16,434 మంది నిధులందక కూటమి ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వెబ్‌ల్యాండ్ అధారంగా...

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు రైతులకు అందించిన రైతు భరోసా పథకానికి వెబ్‌ల్యాండ్‌లో భూమి ఉందా లేదా అని మాత్రమే పరిశీలించి పేర్లున్న ప్రతిరైతుకు ఆర్థిక భరోసా కింద ఏటా రూ.13,500 సహాయం అందించారు. దీనివల్ల ఒక్క రైతుకు నష్టం కలగలేదు. అందరికీ సహాయం అందింది. వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో జిల్లాలో రూ.1191.03 కోట్ల మేర రైతులకు లబ్ధి చేకూరింది.

ఇప్పుడు కొర్రీలు....

కూటమి ప్రభుత్వం ప్రతి రైతుకు రూ.20వేల పెట్టుబడి సాయాన్ని ఏటా ఇస్తామని ప్రకటించింది. మొదటి ఏడాది రైతులకు ఎగనామం పెట్టిన ప్రభుత్వం..రెండో ఏడాదిలో దీన్ని అమలు చేయడం కోసం కొర్రీలు విధించింది. లేనిపోని నిబంధనలు పెట్టడంతో జిల్లాలో 16,434 మంది రైతులు అన్నదాత సుఖీభవ పథకానికి అర్హత కోల్పోయారు. దీంతో పథక అమలులోనే తొలి విడత నిధుల కింద రూ. 11.50 కోట్ల ఆర్థిక సహాయన్ని పొందలేకపోయారు. అసలే కరువుతో ఇబ్బందులు పడు తున్న రైతాంగానికి అండగా నిలవాల్సిన ప్రభు త్వం పథకం అమలులో మొండి చెయ్యి చూపింది. ఈ లెక్కన అర్హత కోల్పోయిన రైతులు ఏడాది మొత్తానికి రూ.20 వేలు చొప్పున రూ. 328.68 కోట్లు మేర నష్టపోనున్నారు.

వైఎస్సార్ ప్రభుత్వం విడుదల చేసిన రైతు భరోసా, పీఎం కిసాన్ నిధుల వివరాలు

సంవత్సరం	రైతుల సంఖ్య	విడుదలైన నిధులు (కోట్లలో)
2019-20	206708	279.93
2020-21	208747	280.06
2021-22	199344	269.11
2022-23	202598	235.68
2023-24	210481	277.56

ఉప పోరు.. ప్రచార హోరు


ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో ఆకేపాటి

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నిక ప్రచారంలో వైఎస్సార్‌సీపీ జోరుగా ఇంటింటి ప్రచారం చేసింది. ఆదివారం మండల పరిధిలోని దర్జిపల్లి, గొల్లపల్లి, దవంతరపల్లి, నరసన్నగారిపల్లి, పెన్నపేరూరు, తప్పెటవారిపల్లి గ్రామాల్లో అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డితో కలిసి పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆకేపాటి మాట్లాడుతూ జిల్లా ప్రజా పరిషత్‌కు సంబంధించిన నిధులు మండల అభివృద్ధికి వినియోగించాలంటే వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డిని గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీకి వేసే ప్రతి ఓటు కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు చేసిన మోసానికి చెప్పపెట్టు అన్నారు. సోమశిల ముంపు వాసులకు నష్టపరిహారం అప్పటి ప్రభుత్వం తక్కువగా ఇస్తే ఇక్కడి రైతులతో కలిసి తాము ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని గుర్తుచేశారు.

నమ్మకాన్ని నిలబెట్టుకుంటా

జడ్పీటీసీ అభ్యర్థి ఇరగంరెడ్డి మాట్లాడుతూ తనపై వైఎస్సార్‌సీపీ పెట్టుకున్న నమ్మకానికి మండల ప్రజల గుండెల్లో స్థానాన్ని సంపాదించుకొని, ఉప ఎన్నికలో తప్పక విజయం సాధించి, వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి ఏకుల రాజేశ్వరిరెడ్డి, వైఎస్సార్‌సీపీ ఒంటిమిట్ట మండల అధ్యక్షుడు టక్కోలు శివారెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి, రాజంపేట నియోజకవర్గ యూత్ వింగ్ అధ్యక్షుడు కూండ్ల ఓబుల్ రెడ్డి, ఒంటిమిట్ట మండల పంచాయతీ రాజ్ అధ్యక్షుడు మేరువ శివనారాయణ, గొల్లపల్లి సర్పంచ్ దున్నూతల లక్ష్మీనారాయణరెడ్డి, పెన్నపేరూరు ఎంపీటీసీ ముమ్మడి నారాయణరెడ్డి, కొత్తమాధవరం 1,2,3 వార్డుల సర్పంచ్ చేపూరి ఓబయ్య, మండల ప్రచారం విభాగం అధ్యక్షుడు రాజశేఖర్ రాయల్ పాల్గొన్నారు.

పోలీసుల గస్తీ

సిద్ధవటం: సిద్ధవటం పెన్నానదిపై ఉన్న లోలెవల్ కాజ్‌వే పై పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ సుబ్బరామచంద్ర మాట్లాడుతూ సిద్ధవటం వద్ద పెన్నానది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఆదివారం పర్యాటకులు ఎక్కువగా వస్తుంటారన్నారు. ఒంటిమిట్ట సీఐ బాబు, సిద్ధవటం ఎస్ఐ సూచనల మేరకు కాజ్‌వేపైన పోలీసుల బందోబస్తును ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రమాదాలు జరగకుండా మందస్తు చర్యగా అక్కడికి పర్యాటకులను రానివ్వలేదన్నారు. ఉదయం చేపలు పట్టే వారు వస్తే వారిని కూడా అక్కడినుంచి పంపిచేశామన్నారు.కొత్త వ్యక్తులు ఎవరైనా వచ్చి నదిలోకి దిగుతారనే ఉద్దేశంతో కాజ్‌వే వద్ద ఉన్నామని ఏఎస్ఐ తెలిపారు.


పెన్నానది లోలెవల్ కాజ్‌వే వద్ద ఉన్న పోలీసులు

ప్రభుత్వం సహకరిస్తే పతకాలు సాధిస్తాం

శాప్ డైరెక్టర్ రమణరావు


మాట్లాడుతున్న శాప్ డైరెక్టర్ ఆరికపూడి రమణరావు

కడప రూరల్: ప్రభుత్వం సహకరిస్తే పతకాలు సాధిస్తామని ద్రోణాచార్య అవార్డు గ్రహీత, రాష్ట క్రీడా సాధికార సంస్థ డైరెక్టర్ (శాప్) ఆరికపూడి రమణరావు అన్నారు. ఆదివారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. శాప్ చైర్మన్ ఆదేశాల మేరకు కడప క్రీడా పాఠశాలను తనిఖీ చేశామన్నారు. ఈ సందర్భంగా క్రీడా మైదానాలు, క్రీడాకారుల మౌలిక సదుపాయాలను పరిశీలించామన్నారు. అలాగే క్రీడాకారులతో మాట్లాడామని తెలిపారు. క్రీడల్లో పతకాలు సాధించాలంటే నిధుల అవసరం ఎంతో ఉంటుందన్నారు. క్రీడలకు బడ్జెట్‌లో అధిక శాతం నిధులు కేటాయించినపుడు జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో రాణించవచ్చన్నారు. ప్రభుత్వం ఆర్థికంగా చేయూతనందిస్తే పతకాలను సాధిస్తామని తెలిపారు. మరో డైరెక్టర్ పేరం రవీంద్రనాథ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటివరకు ఏడు వేల మంది ఫిజికల్ డైరెక్టర్లు ఉన్నారని, మరో రెండు వేల మంది ఫిజికల్ డైరెక్టర్లు రానున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఫిజికల్ డైరెక్టర్లు తమ సమస్యలను విన్నవించి పరిష్కరించాలని కోరారు. జిల్లా స్కూలు గేమ్స్ సెక్రటరీ అరుణకుమారి, రాష్ట్ర పీఈటీ అసోసియేషన్ సెక్రటరీ ప్రవీణ్ కిరణ్, వ్యాయామ ఉపాధ్యాయులు సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

పలు మండలాల్లో వర్షం



కడప అగ్రికల్చర్: జిల్లాలో పలు మండలాల్లో ఆదివారం తెల్లవారుజామున వర్షం కురిసింది. ఇందులో భాగంగా రాజుపాలెంలో అత్యధికంగా 40 మి.మీ వర్షం కురిసింది. అలాగే దువ్వూరులో 16.6, చాపాడులో 1.2 ,బి.మఠంలో 1 మి.మీ వర్షం కురిసింది.

ఉప ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలి


అనుబంధ సంఘాల అధ్యక్షులతో మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్ రెడ్డి

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి పిలుపు

కడప కార్పొరేషన్: పులివెందుల, ఒంటిమిట్ట మండలాల్లో జరుగుతున్న జిల్లా పరిషత్ ఉప ఎన్నికల్లో పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన అనుబంధ విభాగాల అధ్యక్షుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉప ఎన్నికల్లో ఎలాగైనా గెలిచేందుకు అధికార టీడీపీ ఎన్ని అడ్డదారులైనా తొక్కుతుందన్నారు. పోలీసులను ఉపయోగించి వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు కూడా బనాయిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ శక్తివంచన లేకుండా పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. కూటమి ప్రభుత్వ 14 నెలల పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. రూ.1.87లక్షల కోట్లు అప్పులు చేసి ఏ ఒక్క సంక్షేమ పథకమూ సక్రమంగా అమలు చేయలేదన్నారు. తల్లికివందనం, అన్నదాత సుఖీభవ పథకాల్లో లబ్ధిదారులను కోత కోశారన్నారు. ప్రశ్నించే వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపుతున్నారన్నారు. ఈ దుర్మార్గ పాలనను ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని, జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఐదు రోజులపాటు జరిగే ప్రచార కార్యక్రమాల్లో అనుబంధ సంఘాల అధ్యక్షులు పాల్గొని ఇంటింటి ప్రచారం చేయాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పులి సునీల్ కుమార్, పాకా సురేష్, అనుబంధ సంఘాల అధ్యక్షులు ఎస్. వెంకటేశ్వర్లు, టీపీ వెంకటసుబ్బమ్మ, జాషువా, దేవిరెడ్డి ఆదిత్య, మేసా ప్రసాద్, రామక్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'జెడ్పీటీసీ' విజయానికి సమష్టిగా కృషి చేద్దాం

- కూటమి సర్కార్ అబద్ధపు హామీలను ప్రజలకు వివరించాలి
- కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి


వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల రూరల్: పులివెందుల మండల జెడ్పీటీసీ స్థానానికి సంబంధించి ఈనెల 12న జరిగే ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ అభ్యర్థి విజయానికి సమిష్టిగా పనిచేయాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో పులివెందుల మండల పరిధిలోని నల్లపురెడ్డిపల్లె, కొత్తపల్లె, అచ్చివెళ్లి, కనంపల్లె, రాగిమానుపల్లె, మోట్నూతలపల్లె గ్రామాలకు సంబంధించిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ అభ్యర్థి హేమంత్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరిస్తూ వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేయాలని అభ్యర్థించాలన్నారు. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చి 14 నెలలవుతున్నా.. ప్రజలకు పథకాలు అందడం లేదనే విషయాన్ని గ్రామాల్లోని ఓటర్లకు వివరించాలన్నారు. అబద్ధపు హామీలతో చంద్రబాబు అధికారంలోకి వచ్చారని... ఆయన చెప్పిన పథకాలన్నింటిలో ఏ ఒక్కటి కూడా అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారన్నారు. పోలీసులను అడ్డం పెట్టుకొని జెడ్పీటీసీ ఎన్నికలలో ప్రభుత్వం నీచ రాజకీయాలు చేసేందుకు సిద్ధమైందని మండిపడ్డారు. పోలీసులు, అధికారులను అడ్డు పెట్టుకొని ఇప్పటికే పులివెందుల మండల పరిధిలోని గ్రామాల్లో ఉన్న వైఎస్సార్‌సీపీ నాయకులను భయభ్రాంతులకు గురి చేసే విధంగా పోలీస్ స్టేషన్లకు పిలిపించుకుంటుండడం సరికాదన్నారు. పచ్చ నేతల కుట్రలను అడ్డుకుంటూ.. వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న హేమంత్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకోవడానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు నేటి నుంచి సమిష్టి కృషితో కష్టపడి పని చేయాలన్నారు. తుమ్మల మహేశ్వర రెడ్డి కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అండగా నిలవాల్సిన సమయం వచ్చిందని.. జెడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న హేమంత్‌రెడ్డిని గెలిపించి పులివెందుల ఖ్యాతిని నిలబెట్టే విధంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని కోరారు.

చంద్రబాబు పాలనలో భవిష్యత్ అంధకారం

చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన ఈ 14నెలల్లోనే ప్రజల భవిష్యత్ అంధకారంలో పడిందని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలు సక్రమంగా అమలుచేయక రాష్ట్ర ప్రజలను ముంచారన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయలేని సీఎంకు రాష్ట్రాన్ని పాలించే హక్కు లేదన్నారు. ఓట్ల కోసం అలివికాని హామీలు ఇచ్చిన బాబు మోసాలను ఎండగట్టాలని కార్యకర్తలకు, నేతలకు సూచించారు. చంద్రబాబు అధికారంలోకి రాగానే ప్రజలు కరువు బారిన పడ్డారన్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీలు, పథకాల ఎగవేతపై ప్రజలకు వివరించాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

యువకుడి మృతదేహం లభ్యం

జమ్మలమడుగు రూరల్ : పెన్నానదిలో గల్లంతైన గోపాల్ (35) అనే యువకుడి మృతదేహం ఆదివారం లభ్యమైంది. జమ్మలమడుగు మండలంలోని గూడెంచెరువు గ్రామంలో శుక్రవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కార్యక్రమంలో బారికేడ్లు ఏర్పాటు చేసేందుకు కడప నుంచి వచ్చిన కూలీలు షేక్ మున్నా, గోపాల్ పెన్నానదిలో గల్లంతయ్యారు. గజ ఈతగాళ్లు షేక్ మున్నా మృతదేహాన్ని అదేరోజు వెలికి తీశారు. గోపాల్ మృతదేహం కోసం గాలింపు చర్యలు కొనసాగగా ఆదివారం లభ్యమైంది.

లారీ బోల్తా

ముద్దనూరు : ముద్దనూరు–తాడిపత్రి జాతీయ రహదారిలో ఓబుళాపురం గ్రామం వద్ద ఆదివారం లారీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఎర్రగుంట్ల నుంచి తాడిపత్రికి ప్రయాణిస్తున్న లారీ టైరు పగిలిపోవడంతో రహదారి పక్కన లోతట్టు ప్రాంతంలోకి బోల్తాపడినట్లు స్థానికులు తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

మదనపల్లె రూరల్ : ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తిని లారీ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి పరిస్థితి విషమంగా మారిన ఘటన ఆదివారం మదనపల్లి మండలంలో జరిగింది. వేంపల్లి దళితవాడకు చెందిన శంకర (52) బెంగళూరు రోడ్‌లో సప్లయర్స్ దుకాణం నిర్వహిస్తున్నాడు.

కేజీబీవీ విద్యార్థులను తీర్చిదిద్దాలి

విద్యాశాఖ రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ దేవరాజు



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ దేవరాజు

కడప ఎడ్యుకేషన్ : కేజీబీవీలలో చదువుతున్న విద్యార్థులను మట్టిలో మాణిక్యాలుగా తీర్చిదిద్దాలని కేజీబీవీల సబ్జెక్టు టీచర్లకు రాష్ట్ర విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ దేవరాజు పిలుపు నిచ్చారు. ఆదివారం కడప నగర శివార్లలోని గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాలలో జీసీడీఓ దార్ల రూతు ఆరోగ్య మేరీ అధ్యక్షతన రాయలసీమ పరిధిలోని కేజీబీవీలలో పనిచేసే ఫిజిక్స్,కెమిస్ట్రీ సబ్జెక్టు టీచర్లకు ఇన్ సర్వీస్ రెసిడెన్షియల్ శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ శిక్షణకు రాయలసీమ పరిధిలోని కడప, శ్రీసత్యసాయి, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, అనంతపురం, కర్నూలు, నంద్యాల తోపాటు నెల్లూరు జిల్లాకు చెందిన ఉపాధ్యాయులు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన విద్యాశాఖ రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ మాట్లాడుతూ కేజీబీవీలలో విద్యనభ్యసించే విద్యార్థులంతా చదువుతోపాటు ఆర్థికంగా వెనుకబడిన వారేనన్నారు. అలాంటి వారికి సేవ చేయడం మన అదృష్టంగా భావించాలని కోరారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను ప్రోత్సహించి వారికి విద్యాబుద్ధులు నేర్పించి అభివృద్ధి బాటలోకి తీసుకొచ్చే వారే నిజమైన ఉపాధ్యాయులన్నారు. సమగ్రశిక్ష ఏపీసీ నిత్యానందరాజులు మాట్లాడుతూ ఈ శిక్షణ ద్వారా మరిన్ని కొత్త విషయాలను నేర్చుకుని తరగతి గదిలో విద్యార్థులకు నేర్పించి వారి ఎదుగుదలకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్ష కార్యాలయ సూపరింటెండెంట్ ప్రేమకుమారి, సెక్టోరియల్ అధికారి వీరేంద్రరావు, ఏఎస్ఓ సంజీవరెడ్డి, రిసోర్సు పర్సన్లు సమగ్రశిక్ష సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు



పరుగు పోటీలో క్రీడాకారులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ క్రీడా మైదానంలో ఆదివారం బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అండర్ 14, 16 బాలబాలికల జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 350 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వీరికి 60 మీటర్లు, 600 మీటర్ల పరుగు పోటీలు, లాంగ్ జంప్, హై జంప్, షాట్ పుట్, జావెలిన్‌త్రో ట్రయథ్లాన్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన 30 మంది క్రీడాకారులను రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక చేసినట్లు ఫౌండేషన్ కార్యదర్శి వై.అహ్మర్ బాషా తెలిపారు. వీరు ఈనెల 9, 10, 11వ తేదీల్లో బాపట్లలో జరిగే ఏపీ స్టేట్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. వ్యాయామ సంచాలకులు నాగూర్ బాషా, శివారెడ్డి, ఎర్రన్న, శంకర్, నరేష్, చందు, నాగేశ్వరరావు, ఖాదర్‌రెడ్డి, దిలీప్, కోచ్ వివేకానందరెడ్డి, రబ్బాని, భార్గవ్ అథ్లెటిక్స్ పోటీల నిర్వహణలో సహకరించారన్నారు.

సెప్టెంబర్ 8 నుంచి కడపలో వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కౌన్సిల్ సమావేశాలు



మాట్లాడుతున్న అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : సెప్టెంబర్ 8,9,10, తేదీలలో అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కౌన్సిల్ సమావేశాలు కడప నగరంలో నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం కడప నగరంలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో

భూ పంపిణీ –సాగునీరు – పారిశ్రామిక అభివృద్ధి అనే అంశంపై రాష్ట్ర సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కౌన్సిల్ సమావేశాలకు దేశవ్యాప్తంగా 29 రాష్ట్రాల నుంచి 200 మంది జాతీయ నాయకులతో పాటు కేరళ, బెంగాల్, త్రిపుర, తమిళనాడు, రాజస్థాన్ రాష్ట్రాల నుంచి ఎన్నికైన ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరవుతారని తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం భూమి లేని పేదలకు భూ పంపిణీ చేపట్టాలని డిమాండ్ చేశారు. 'ఉంటే ప్రభుత్వ భూముల్లో ఉంటాము– లేకుంటే జైల్లో ఉంటాము' అనే నినాదంతో వ్యవసాయ కార్మికులందరూ గ్రామ, గ్రామాన దండుగా ఐక్య భూ పోరాటాలకు సంసిద్ధం కావాలని పిలుపునిచ్చారు. భూమిలేని గ్రామీణ నిరుపేదలకు భూ పంపిణీ చేస్తేనే నిజమైన అభివృద్ధి సాధ్యమని తెలిపారు. కేరళలోని వామ పక్ష ప్రభుత్వం ప్రతి కుటుంబానికి 3 ఎకరాల భూమి, ప్రతి వ్యవసాయ కార్మికునికి రోజువారీ కూలి 1000 రూపాయలు ఇస్తోందని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంబానీ, అదానీలకు 20 లక్షల కోట్ల ఆదాయం పెంచారని, వ్యవసాయ కార్మికులకు రోజువారి ఆదాయం 200 కూడా పెంచ లేదని విమర్శించారు. జిల్లాలో మొదటి విడతగా 7 మండలాల్లో 20 గ్రామాలలో భూ పోరాటాలు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జి.చంద్రశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి వి.అన్వేష్, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఐ.ఎం.సుబ్బమ్మ, చేతి ఉత్పత్తిదారుల సంఘం జిల్లా నాయకులు వి.పి.బయన్న, వీ.శివ నారాయణ, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.చిన్ని, వి.శివకుమార్, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.జకరయ్య తదితరులు పాల్గొన్నారు.

చెలరేగిపోతున్న గ్రావెల్ మాఫియా



టిప్పర్లలో తరలుతున్న గ్రావెల్

సాక్షి టాస్క్‌ఫోర్స్ : చింతకొమ్మదిన్నె మండల పరిధిలో గ్రావెల్ మాఫియా చెలరేగిపోతోంది. సంబంధిత శాఖల అధికారులు వారికి కూటమి ప్రభుత్వం నేతల అండదండలు ఉన్నాయనే నెపంతో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. గుట్టలు, చెరువులు గుల్ల చేసిన గ్రావెల్ మాఫియా అటవీ ప్రాంతాల్లో నాణ్యమైన గ్రావెల్ లభిస్తుండటంతో రిజర్వు ఫారెస్ట్ ప్రాంతాల్లో సైతం చెట్లను తొలగించి గ్రావెల్ తరలిస్తున్నారు. గత మూడు రోజులుగా రేయింబవళ్లు కొలుములపల్లె పంచాయతీలోని గుర్రంగుంపు రిజర్వాయర్ పైభాగంలోని దక్షిణ దిశలో రిజర్వు ఫారెస్ట్ గుల్ల చేస్తూ మూడు పెద్ద హిటాచీలు, 30 టిప్పర్లు ఏర్పాటు చేసుకొని గ్రావెల్ మాఫియా వ్యాపారం చేస్తోంది. యథేచ్ఛగా జాతీయ రహదారిపై మూడు రోజులుగా టిప్పర్లు గ్రావెల్ లోడుతో ప్రయాణిస్తున్నా మైనింగ్ శాఖ అధికారులు, అటవీ శాఖ అధికారులు కనీసం పట్టించుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వీరభద్రస్వామిని దర్శించుకున్న కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి



వీరభద్రస్వామి సన్నిధిలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి బసవరాజు

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ వీరభద్ర స్వామిని కర్ణాటక రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి బసవరాజు దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఈఓ డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామి వారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

మహిళా ప్రయాణికురాలిపై దురుసు ప్రవర్తన



మహిళా ప్రయాణికురాలితో దురుసుగా ప్రవర్తిస్తున్న కండక్టర్




చిన్నపాటి వర్షానికి తడుస్తున్న ప్రయాణికులు

వేంపల్లె : రాయచోటి ఆర్టీసీ డిపోకు చెందిన బస్సులో కండక్టర్ మహిళా ప్రయాణికురాలిపై దురుసుగా ప్రవర్తించాడు. ఆదివారం వేంపల్లె–రాయచోటి బస్సులో కండక్టర్ మహిళ మెడపై చెయ్యి వేసి నెట్టి ఆమెను దుర్భాషలాడాడు. ఆమె పోలీస్ స్టేషన్‌కు వెళ్దాం పద అన్న తర్వాత కండక్టర్ తగ్గాడు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న రాయచోటి డిపో బస్సులోనే ఇలా జరగడం చాలా బాధాకరమని ప్రయాణికులు మండిపడ్డారు.

చిన్నపాటి వర్షానికి కారడం దారుణం..

వేంపల్లె – రాయచోటికి ప్రయాణించే ఆర్టీసీ బస్సు చాలా దారుణంగా ఉందని ప్రయాణికులు మండిపడ్డారు. ఆదివారం రాయచోటి డిపోకు చెందిన ఏపీ02జెడ్ 0254 నంబర్ గల ఏపీఎస్ ఆర్టీసీ ఆర్డినరీ బస్సులో ప్రయాణికులు మొత్తం వర్షపు నీటితో తడిచి పోయారు. వర్షం పడితే ఆ బస్సులో ప్రయాణికులు స్నానం చేసినట్లే అని వాపోతున్నారు. ఈ బస్సులో ప్రతి కిటికీకి అద్దం ఒకటే ఉంది. రాయచోటి ఆర్టీసీ డీఎం గమనించి ఇలాంటి పాతబడిన, కాలం చెల్లిన బస్సులను నడపొద్దని ప్రయాణికులు కోరుతున్నారు.

భయానక వాతావరణం సృష్టిస్తున్న టీడీపీ నాయకులు



మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిశోర్ బూసిపాటి

పులివెందుల టౌన్ : ఈనెల 12వతేదీన జరగనున్న పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికలో టీడీపీ నాయకులు భయానక వాతావరణాన్ని సృష్టించేందుకు పన్నాగం పన్నుతున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిశోర్ బూసిపాటి ఆరోపించారు. ఆదివారం స్థానిక భాకరాపురంలోని వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికలో రాజకీయ క్రీడ జరగడంలేదని, జూదగాళ్ల క్రీడ జరుగుతోందన్నారు. తొడలు కొట్టి, మీసాలు మెలేసి ప్రజలను రెచ్చగొట్టి తగాదాలు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, ఇన్‌చార్జి మంత్రి సవితకు ప్రజలను రెచ్చగొట్టడం తప్ప వీరికి రాజకీయ విలువలు తెలుసా అని ప్రశ్నించారు. చంద్రబాబు ఇచ్చే వంద కోట్ల రూపాయల పార్టీ ఫండ్ కోసమే బీటెక్ రవి ఆయన భార్యను పోటీకి నిలబెట్టారన్నారు. పులివెందులలో టీడీపీ గెలిచే ప్రసక్తే లేదని, ఈ విషయం బీటెక్ రవికి, ఆదినారాయణరెడ్డికి బాగా తెలుసు అన్నారు. ఈనెల 12వ తేదీన జెడ్పీటీసీ ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి నేతృత్వంలో ఇంటింటికి తిరిగి వైఎస్సార్‌సీపీ చేపట్టిన అభివృద్ధిని వివరిస్తామన్నారు. పులివెందులకు మెడికల్ కళాశాల అవసరమని ముఖ్యమంత్రిని అడిగే దమ్ములేని వాళ్లు ఎన్నికల్లో పోటీ చేస్తారా అని ఘాటుగా విమర్శించారు. వైఎస్సార్‌సీపీకి మద్దతుగా ప్రచారం చేస్తే అక్రమ కేసులు పెడతామని, రౌడీ షీట్ తెరుస్తామని ఇప్పటి నుంచే బెదిరింపు కాల్స్ మొదలయ్యాయన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు వినోద్ కుమార్, వైఎస్సార్‌సీపీ వైద్య విభాగాం కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ పెంచలయ్య పాల్గొన్నారు.

అక్షయపాత్ర ద్వారా విద్యార్థులకు నాణ్యమైన భోజనం

ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి హామీ



ట్రిపుల్ ఐటీ అధికారులు, విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

వేంపల్లె : రాష్ట్ర వ్యాప్తంగా ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులందరికీ అక్షయపాత్ర సంస్థ ద్వారా త్వరలో నాణ్యమైన భోజనాన్ని అందించనున్నట్లు ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. గత మూడు రోజులుగా ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలోని రెండు మెస్‌లలో పురుగుల భోజనం పెడుతున్నారని శనివారం రాత్రి విద్యార్థులు నిరసన తెలిపారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి ఆదివారం ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీని సందర్శించారు. అలాగే ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమార స్వామి గుప్తా, పరిపాలన అధికారి డాక్టర్ రవికుమార్‌లతో పాటు ఆయా శాఖల అధికారులతో కలిసి ఎమ్మెల్సీ విద్యార్థులకు భోజనం అందించే మెస్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెస్‌ల తనిఖీలో అవినీతితో పాటు అపరిశుభ్రంగా ఉండడంతో మెస్ నిర్వాహకులపై, అధికారులపై ఎమ్మెల్సీ అసహనం వ్యక్తం చేశారు. మెస్‌ల వద్దనే సిబ్బంది మూత్ర విసర్జన చేయడం మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. అధికారులు కూడా అప్పుడప్పుడు పరిశీలన చేస్తూ ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి లోకేష్ ఆదేశాల మేరకు ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీని ఆకస్మికంగా తనిఖీ చేసినట్లు చెప్పారు. తనిఖీల్లో కాంట్రాక్టర్లు విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతున్న అంశం తేలిందన్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చే వరకు అవినీతికి పాల్పడుతున్న మెస్ నిర్వాహకుల బిల్లులను ఆపాలని డైరెక్టర్‌ను ఆదేశించినట్లు చెప్పారు. రాష్ట్రంలోని నాలుగు ట్రిపుల్ ఐటీలను అక్షయపాత్ర ఫౌండేషన్‌కు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఆగస్టు చివరి వారం నుండి అక్షయ పాత్ర ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు నాణ్యమైన భోజనం సరఫరా చేసే కార్యక్రమాన్ని రాష్ట్రంలోని అన్ని ట్రిపుల్ ఐటీలలో ప్రారంభిస్తామని చెప్పారు. ఎమ్మెల్సీ వెంట గండి దేవస్థానం మాజీ ఛైర్మన్ జీవీ రమణ, డీవీ సుబ్బారెడ్డి, ఎస్పీ జయచంద్రారెడ్డి, ఇడుపులపాయ యూనిట్ ఇన్‌చార్జి పోతిరెడ్డి శివ, కావలి భాను కిరణ్, ట్రిపుల్ ఐటీ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ అదుపు తప్పి వ్యక్తి మృతి



ప్రమాదంలో మృతి చెందిన వెంకటరత్నం

కలకడ : ట్రాక్టర్ అదుపు తప్పి ఒక వ్యక్తి మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలైనట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. ఆయన కథనం మేరకు.. శనివారం రాత్రి కలకడ మండలంలోని రాతిగుంటపల్లె పంచాయతీ, బట్టావారిపల్లె సమీపంలోని టమాటా పంట సాగుకు వినియోగించే సీడ్స్ కర్రలను కలకడ మండలంలోని దేవులపల్లెకు తరలిస్తుండగా రాతిగుంటపల్లె పంచాయతీ లక్ష్మీపురం గ్రామం మలుపువద్ద ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో దేవులపల్లెకు చెందిన వెంటరత్నం(38) అక్కడికక్కడే మృతి చెందగా, గుర్రంకొండ మండలం మర్రిమేకలవారిపల్లె దళితవాడకు చెందిన నరసింహులుకు కాలు విరిగి తీవ్ర రక్తగాయాలయ్యాయి. మృతుని బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కారును ఢీకొన్న ద్విచక్ర వాహనం

ఒకరికి తీవ్ర గాయాలు



గాయపడిన బోనంశెట్టి రవీంద్ర

రామాపురం (రాయచోటి జగదాంబసెంటర్) : రామాపురం మండలం కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ దళితవాడ సమీపంలో ఆదివారం ఆగి ఉన్న కారును టీవీఎస్ ఎక్సెల్ ఢీకొన్న సంఘటనలో బోనంశెట్టి రవీంద్ర అనే వ్యక్తికి తీవ్ర గాయాలైనట్లు రామాపురం పోలీసులు తెలిపారు. కడప నుంచి రాయచోటి వైపు వెళ్తున్న టీఎన్ 01ఏఈ 7263 నెంబర్ గల కారు గువ్వల చెరువు దళితవాడ సమీపంలో ఆగి ఉండగా వెనుకవైపు నుంచి సరస్వతిపల్లెకు చెందిన బోనంశెట్టి రవీంద్ర ఏపీ02బివి 8652 నెంబర్ గల టీవీఎస్ ఎక్సెల్‌లో వస్తూ ప్రమాదవశాత్తు కారును ఢీకొన్నాడు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని గాయపడిన వ్యక్తిని 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రామాపురం పోలీసులు తెలిపారు.

మద్యానికి బానిసలై ఇద్దరి మృతి

మదనపల్లె రూరల్ : వేర్వేరు ఘటనల్లో మద్యానికి బానిసైన ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. మండలంలోని బసినికొండకు చెందిన లక్ష్మన్న, పద్మ దంపతుల కుమారుడు పవన్ (40)కు 15 సంవత్సరాల క్రితం భారతితో వివాహం కాగా, పెళ్లయిన ఏడాదికే ఆమె అనారోగ్య కారణాలతో మృతి చెందింది. అప్పటినుంచి పవన్ మద్యానికి బానిసై, పనులకు వెళ్లకుండా నిత్యం మద్యం తాగుతూ ఉండేవాడు. ఆదివారం బసినికొండ సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద, అతిగా మద్యం తాగి అపస్మారక స్థితిలో పడి ఉండగా, గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన అత్యవసర విభాగం వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో కుటుంబ సభ్యులు మృతదేహాన్ని ఇంటికి తీసుకు వెళ్లారు. అదేవిధంగా పట్టణంలోని మార్పురి వీధికి చెందిన ఖాదర్ బాషా కుమారుడు షరీఫుద్దీన్ (38) మద్యానికి బానిసై కుటుంబాన్ని నిర్లక్ష్యం చేసి పనులకు వెళ్లకుండా నిత్యం మద్యం తాగేవాడు. అతని భార్య హమీదా స్థానికంగా కూలి పనులకు వెళ్తూ కుమారుడిని కుటుంబాన్ని పోషించుకుంటుంది.